
ఆంధ్రజ్యోతి
**** గరిష్ఠం 30.5 కనిష్ఠం 22.4
ANDHRAJYOTHY



పొలానికి వెళ్లొచ్చేలోగా చోరీ

3.5 తులాల బంగారం, రూ.61వేల నగదు, 65 తులాల వెండి అపహరణ



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

చందంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చందంపేట మండలం చిత్రియాలలో చోరీ జరిగింది. సుమారు రూ.5 లక్షల సొత్తును దొంగలు ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం చిత్రియాలలో జూలూరు మహేష్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి భార్య, కుమారుడితో కలిసి పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి రాగా వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. ఇంట్లో భద్రపరిచిన 3.5 తులాల బంగారు ఆభరణాలు, 65 తులాల వెండి వస్తువులు, రూ.61వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహేష్ ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేసినట్లు లోకేష్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిర్యాలగూడలో ఆర్టీసీ కండక్టర్ ఇంట్లో



తనిఖీలు నిర్వహిస్తున్న క్లూస్‌టీం

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆర్టీసీ కండక్టర్ ఇంట్లో చోరీ జరిగింది. మంగళవారం వన్‌టౌన్ సీఐ నాగభూషణరావు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న చామల పార్వతి సోమవారం ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లింది. విధులు ముగించుకొని రాత్రి ఇంటికి చేరుకోగా తాళాలు పగులగొట్టి, ఇంట్లోని వస్తువులు చిందరవందర పడవేసి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చింది. ఇంట్లో దాచుకున్న 6 తులాల బంగారు నగలు, రూ.80వేల నగదును దొంగలు చోరీ చేసినట్లు బాధితురాలు తెలిపింది. చోరీ జరిగిన ఇంటిని వన్‌టౌన్ సీఐ నాగభూషణరావు పరిశీలించారు. అనంతరం నల్లగొండ నుంచి క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అత్తారింటి వేధింపులు తాళలేక ఆశావర్కర్ ఆత్మహత్య



రేణుక(ఫైల్‌ఫొటో)

చండూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చండూరు పట్టణ పరిధిలోని అంగడిపేటలో అత్తారింటి వేధింపులు తాళలేక ఆశా వర్కర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు. ఆయన వివరాల ప్రకారం అంగడిపేటకు చెందిన మోటారు మెకానిక్ పెద్దబోయిన శ్రీనుకు నల్లగొండకు చెందిన రేణుక(38)తో వివాహం కాగా వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. బీటెక్ చదువుతున్న కుమారుడు రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోగా డిగ్రీ చదువుతున్న కుమార్తె కొన్నినెలల కిందట ప్రేమవివాహం చేసుకుంది. రేణుక ఆశావర్కర్‌గా పనిచేస్తుండగా సోమవారం చండూరులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగిన సమావేశానికి హాజరై, మధ్యాహ్నం ఇంటికి చేరుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగింది. ఇంటికి వెళ్లిన స్థానికులు అపస్మారకస్థితిలో ఉన్న రేణుకను అంబులెన్స్‌లో నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త శ్రీను, ఆయన బంధువుల వేధింపుల కారణంగానే మనస్థాపానికి గురై తన కుమార్తె రేణుక ఆత్మహత్యకు పాల్పడిందని, ఆమె తల్లి పిల్లి మణెమ్మ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ..

భువనగిరి రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మానసికంగా కుంగిన ఓ వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి శివారు రాయిగిరిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. భువనగిరిరూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వేలుపుగొండ కొమురయ్య(61) రెండేళ్ల కిందట భువనగిరి సమీపప్రాంతాల్లోని హోటళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా సోమవారం రాత్రి భువనగిరి శివారులోని రాయిగిరిలోని మల్లన్నగుట్ట సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. కాగా మంగళవారం ఉదయం స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కొమురయ్య కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



దర్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్

నల్లగొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : హజరత్ లతీఫ్‌షా వలీ ఉర్సు ఏ -షరీఫ్ ఉత్సవాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని నల్లగొండ మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఆదేశించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దర్గా పరిసరాలను అధికారులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సయ్యద్ సమాద్, ఖలీల్, ముత్తావల్ సమీ ఉల్లాఖాద్రీ, గౌస్ ఉల్లాఖాద్రీ, ఉబైద్ ఉల్లాఖాద్రీ, సల్మాన్ ఖాద్రీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై ఫిర్యాదు



పట్టణ ఎస్‌ఐ లక్ష్మీనారాయణకు ఫిర్యాదుచేస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

భువనగిరి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలని ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్ర పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆయన చేసిన విద్వేష పూరిత ప్రసంగం ముస్లింల మనోభావాలను కించపరిచిందని, మహ్మద్‌ప్రవక్తను కించపరిచేలా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుచేసిన వారిలో జేఏసీ ప్రతినిధులు ఎండీ అతహర్, ఎండీ షరీఫ్, డీ ఇబ్రహీం, ఎండీ ఇంతియాజ్ ఉన్నారు. కార్యక్రమంలో షరీఫ్, ఇబ్రహీం, మౌలానా, రహీం, అఫ్రోజ్, నాజిమ్, అల్తాఫ్, ఆర్షద్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో గేదెలు మృతి

అడవిదేవులపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా అడవి దేవులపల్లిలో విద్యుదాఘాతంతో నాలుగు పాడి గేదెలు మృతి చెందాయి. అయ్యవారికుంట సమీపంలో మంగళవారం అడవిదేవులపల్లి గ్రామానికి చెందిన కలకొండ భిక్షం, కొట్ర మట్టయ్య, దాసరి సైదయ్య, రావుల శ్రీనులకు చెందిన నాలుగు పాడి గేదెలు మేత మేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. గేదెల విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని విద్యుత్ అధికారులు తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

ఆత్మకూరు(ఎం): యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కొరటికల్ పంచాయతీ మధిర రేగులకుంట గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. రైతు పంజాల శ్రీనివాస్ తన పొలంలో మేత కోసమని గేదెను పొడగాటి తాడుకు కట్టేశాడు. గడ్డి మేసుకుంటూ వెళ్లి దగ్గరలోని ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందింది. సుమారు రూ.45 వేల గేదెను కోల్పోయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

ట్రేడ్ లైసెన్స్‌లపై వ్యాపారుల నిరాసక్తత

- లైసెన్స్‌లు లేకుండానే వ్యాపారాలు
- మునిసిపాలిటీ ఆదాయానికి గండి

సూర్యాపేట జిల్లాలోని మునిసిపాలిటీల్లో ట్రేడ్ లైసెన్స్ తీసుకోవడంలో వ్యాపారస్తులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రోజురోజుకూ వ్యాపారాలు విస్తరిస్తున్నాయి. అయితే వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోకపోవడంతో ఆ స్థాయిలో ఆదాయం రావడంలేదు.



(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటటౌన్)

ట్రేడ్ లైసెన్స్‌ల కోసం వ్యాపారులు దరఖాస్తు చేసుకుంటే అధికారులు దుకాణాన్ని ముందుగా పరిశీలిస్తారు. స్థలం విలువను బట్టి చదరపు అడుగుకు రూ.5 నుంచి రూ.7వరకు ఫీజు వసూలు చేస్తారు. ఈ క్రమంలో ప్లాస్టిక్ దుకాణాలు, గాజుల దుకాణాలు, బేకరీలు, మాంసాహారానికి, ఆటోమొబైల్ దుకాణాలకు సాధారణ లైసెన్స్‌లు అందిస్తారు. అదేవిధంగా వెల్డింగ్, గ్యాస్, అల్యూమినియం, కట్టె కోత మిషన్లు, ఎరువుల దుకాణాలు, ప్రమాదకర విభాగం లైసెన్స్‌లు అందజేశారు. అదేవిధంగా డెయిరీ ఫాం, సిమెంట్, ఫార్మాక్లినిక్, బుక్‌బైండింగ్, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ వంటి వాటికి పారిశ్రామిక లైసెన్స్‌లు అందిస్తారు. అదేవిధంగా బాణాసంచా, గాలిపటాలు, సర్కస్ ఎగ్జిబిషన్, వినాయక విగ్రహాల విక్రయాలు, రాఖీ వంటి సీజనల్ వ్యాపారాలకు తాత్కాలిక లైసెన్సుల అందిస్తారు. ఇలా లైసెన్స్‌లను నాలుగు విభాగాలుగా విభజించి లైసెన్స్‌లు జారీ చేశారు.

సగానికిపైగానే

జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీలు ఉన్నాయి. వీటిలో సూర్యాపేటలో రూ.5వేల వరకు వివిధ రకాల వ్యాపార దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ లైసెన్స్‌లు 2500 వరకు ఉన్నాయి. కోదాడలో 1,630 దుకాణాలు ఉండగా వీటిలో 550 మాత్రమే లైసెన్స్‌లు తీసుకున్నారు. అదేవిధంగా హుజూర్‌నగర్‌లో 820 ఉండగా 548 మాత్రమే లైసెన్స్ ఉన్నాయి. నేరేడుచర్లలో 285 ఉండగా 202 మాత్రమే లైసెన్స్‌లు తీసుకున్నారు. తిరుమలగిరిలో 532 ఉండగా 473 మాత్రమే లైసెన్స్ తీసుకున్నారు. మొత్తంగా సగానికి సగం మంది లైసెన్స్‌లు తీసుకోవడం లేదు. లైసెన్స్‌లు కొంతమంది ఒక ఏడాదికి తీసుకుంటే మరో ఏడాది రెన్యూవల్‌కు ముందుకు రావడంలేదు. అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు, మునిసిపాలిటీ అధికారులు పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి లైసెన్స్‌లపై వ్యాపారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా లైసెన్స్‌లు తీసుకుంటే బ్యాంకురుణాలు వస్తాయని, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు, ప్రకృతి విపత్తు సమయంలో ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉంటుందని లైసెన్స్ పొందిన వ్యాపారులు పేర్కొంటున్నారు.

స్పెషల్ డ్రైవ్ చేపట్టాం



ప్రతి ఒక్క వ్యాపారి విధిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి. ఇప్పటికే స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. బృందాలుగా ఏర్పడి లైసెన్సులు తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. లైసెన్స్ తీసుకోకుంటే జరిమానా విధిస్తున్నాం.

- సీహెచ్ హన్మంతరెడ్డి, సూర్యాపేట మునిసిపల్ కమిషనర్

సీజేఐపై దాడికి యత్నం హేయమైన చర్య





తుంగతుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు, దామెర బీమనపల్లిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడియత్నం హేయమైన చర్య అని పలుసంఘాలు, న్యాయవాదులు అన్నారు. దాడియత్నాన్ని నిరసిస్తూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం పలుచోట్ల నిరసన తెలిపారు. ఇది రాజ్యాంగ వ్యవస్థకు అవమానకరమన్నారు. దేశ చరిత్రలో ఇది చీకటిరోజని పేర్కొన్నారు. సమష్టిగా దేశ సమాజం గవాయ్‌కు సంఘీభావంగా నిలవాలని కోరారు.

నల్లగొండ జిల్లాలో

నల్లగొండ రూరల్ : నల్లగొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున, న్యాయవాది దర్శనం నర్సింహ, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఇందూరు సాగర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

- జస్టిస్ గవాయ్‌పై దాడిని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఏఐఎల్‌యూ) నల్లగొండ జిల్లా కార్యదర్శి అనంతుల శంకరయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మచారి, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ ఖండించారు.
- మర్రిగూడ: దామెర బీమనపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కోశాధికారి ఉదావత్ లచ్చిరాం పాల్గొన్నారు.

సూర్యాపేటలో

- తుంగతుర్తి: జస్టిస్ గవాయ్‌పై దాడియత్నాన్ని నిరసిస్తూ తుంగతుర్తిలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ సభ్యులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్, ఉపాధ్యక్షుడు కారింగుల వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి పర్వీన్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు నర్సయ్య పాల్గొన్నారు.
- నేరేడుచర్ల : నేరేడుచర్లలో పలుసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్, జీలకర రామస్వామి, చిలకరాజు శ్రీను, నాగేందర్, కలీం, మంద భిక్షం, కరుణాకర్, సయ్యద్ హుస్సేన్, ఇంజమూరి మల్లయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు. గవాయ్‌పై దాడిని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు ఖండించారు.
- తిరుమలగిరి: స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు కడెం లింగయ్య,కొత్తగట్టు మల్లయ్య, బూరుగుల ప్రభాకర్, సోమయ్య పాల్గొన్నారు.
- సూర్యాపేటఅర్బన్: జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోటగోపి, నాయకులు యాదగిరి, కర్ణాకర్, వినయ్, రాంబాబు, వేణు, బలరాం పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు విధులు బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ కొంపెల్లి లింగయ్య, వైస్‌ప్రెసిడెంట్ గుంటూరు మధు, వసంత సత్యనారాయణపిళ్లె, మీసాల శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

యాదాద్రిభువనగిరి జిల్లాలో

భువనగిరి టౌన్: సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై దాడియత్నం హేయమైన చర్య అని ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి అన్నారు. భువనగిరి కోర్టు ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఐలు నాయకులు బొల్లెపల్లి కుమార్, పాల్వంచ జగతయ్య, సూదగాని శ్రీహరి, బొడ్డు కిషన్, జిట్టా భాస్కర్‌రెడ్డి, షేక్‌హమీద్‌పాషా,గడ్డం నరసింహ పాల్గొన్నారు.

- భువనగిరి గంజ్: నల్లవస్త్రాలతో అంబేడ్కర్ విగ్రహం వద్ద సామాజిక వేత్తలు నిరసన తెలిపారు.కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నంపట్ల కృష్ణ, జిల్లా అధ్యక్షుడు దుబ్బ లింగం, మాజీ మునిసిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, ప్రజాసంఘాల నాయకులు బట్టు రాంచంద్రయ్య, సురుపంగ శివలింగం, కర్తాల శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు.
- చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్యం వెంకటాచలపతి, న్యాయవాదులు పాల్గొన్నారు.
- చౌటుప్పల్ రూరల్ : జస్టిస్ గవాయ్‌పై దాడిని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయ రాములు ఖండించారు.
- రామన్నపేట: రామన్నపేటలోని పలు కోర్టుల న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండీ మజీద్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కోదాడలో రూ.60 లక్షల గంజాయి పట్టివేత



నిందితులతో పాటు గంజాయి ప్యాకెట్లను ప్రదర్శిస్తున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేట క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని రవాణా చేస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.60లక్షల విలువైన 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ నర్సింహ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. సెప్టెంబరు 23వ తేదీన కోదాడ పరిధిలోని హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి వెంబడి సుమారు 110 కిలోల గంజాయిని గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లారు. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మూడు ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలు, సీసీ ఫుటేజీలు, నమ్మదగిన సమాచారం మేరకు దర్యాప్తు చేపట్టాయి. ఈ నెల 6వ తేదీన జాతీయరహదారిపై కట్టకొమ్ముగూడెం ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న కారును వెంబడించి పట్టుకున్నారు. అందులోని హైదరాబాద్‌కు చెందిన కణం రమేష్ వద్ద నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రమేష్‌ను విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా సీతారాంపురం గ్రామానికి చెందిన చాపల అశోక్, చాపల ఎరుకమ్మతో కలిసి సెప్టెంబరులో కోదాడ పరిధిలో 110 కిలోల గంజాయిని వదిలేసి వెళ్లినట్లు అంగీకరించాడు. దీంతో వారిని కూడా అదుపులోకి తీసుకుని రూ.60లక్షల విలువైన 120 కిలోల గంజాయిని, 8 సెల్‌ఫోన్లను, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ నర్సింహ తెలిపారు. ఈ సందర్భంగా కోదాడ పోలీస్ సిబ్బందిని అభినందించారు. సమావేశంలో కోదాడ సీఐ శివశంకర్, సీసీఎస్ ఎస్‌ఐ హరికృష్ణ, కోదాడ పట్టణ ఎస్‌ఐ హనుమానాయక్, హెడ్ కానిస్టేబుళ్లు బాల్తు శ్రీనివాస్, ఎన్.ఎల్లారెడ్డి, జి.సతీష్, ఎం.వెంకటేశ్వర్లు, కే రాంబాబు, ఫరీద్, సూర్యాపేట పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో

జైలు శిక్ష, జరిమానా

సూర్యాపేటక్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన వారిలో కోర్టు ఒకరికి జైలు శిక్ష, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా నలుగురు మోతాదుకు మించి మద్యం తాగినట్లు తెలిపారు. వారిని సూర్యాపేట సెకండ్‌క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో మంగళవారం హాజరుపర్చగా మెజిస్ట్రేట్ టీవీ రమణ ఒకరికి ఒక రోజు జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా, మిగిలిన ముగ్గురికి కలిపి రూ.3000 జరిమానా విధించినట్లు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు



లావణ్య

చిట్యాలరూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పిట్టంపల్లి గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పిట్టంపల్లికి చెందిన సింగిరెడ్డి సత్తిరెడ్డి కుమార్తె లావణ్య ఆరు నెలల కిందట సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి ఇంటి వద్దే ఉంటోంది. లావణ్య ఈనెల 6వ తేదీన ఉదయం 8 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. తల్లిదండ్రులు చుట్టుపక్కల, తెలిసిన వారిని విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో లావణ్య తండ్రి సత్తిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తమ కుమార్తె అదృశ్యంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా సంతపేటకు చెందిన వ్యక్తిపై అనుమానం ఉందని ఫిర్యాదులో సత్తిరెడ్డి పేర్కొన్నారు.

గోసంరక్షణ అందరి బాధ్యత

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : విశ్వమాత గోమాత అని, గోసంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని అఖిలభారత గోసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని గోసేవాశ్రమంలో గోసేవా కార్యక్రమాలపై ప్రజలకు బోధించారు. కార్యక్రమంలో గోరక్షణ సమితి జిల్లా ప్రముఖ్ బల్ల దుర్వాసులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి, ఒకరికి గాయాలు



శ్రీను మృతదేహం

తుర్కపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం భువనగిరి-గజ్వేల్ రహదారిపై పెద్దతండా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి సోమవారం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ఆంధ్రప్రదేశ్ జిల్లా ఒంగోలు పట్టణ కేంద్రానికి చెందిన వ్యక్తి అని ఎస్‌ఐ తక్యుద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ జిల్లా ఒంగోలు జిల్లా కేంద్రానికి చెందిన శేషయ్య తుర్కపల్లి మండలం రామోజీనాయక్‌తండాలో మేస్త్రీపని చేస్తున్నాడు. శేషయ్య సెప్టెంబరు 23న ఒంగోలు జిల్లా కేంద్రం నుంచి వచ్చేప్పుడు అతడి వెంట ఇద్దరు కూలీలు శ్రీను(30)లను రవిని తీసుకువచ్చాడు. వారు భువనగిరి చేరుకున్న అనంతరం రామోజీనాయక్‌తండాకు చెందిన డ్రైవర్ సీతాపతి వ్యాన్‌లో తండాకు బయలుదేరారు. పెద్దతండా సమీపంలో ఎదురుగా వస్తున్న కారు వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని నలుగురిలో శేషయ్య, శ్రీను, రవిలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్సనిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. వీరిలో శ్రీను చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందాడు. ఇదిలా ఉండగా ఒంగోలులో కూలీల అడ్డాపై ఉండగా తీసుకువచ్చామని అతడి పేరు శ్రీను అని మాత్రమే తెలుసునని మేస్త్రీ శేషయ్య చెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీను మెడపై అమ్మ, కుడి చేతి మీద లవ్ సింబల్, స్టార్ టాటూ మచ్చలు ఉన్నాయని ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా ఆనవాళ్లు గుర్తిస్తే ఫోన్ నెంబర్లు 8712662479, 8712662805కి సమాచారమివ్వాలన్నారు.

మృతురాలి గుర్తింపు

దేవరకొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండబీమనపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మహిళ వివరాలను గుర్తించినట్లు సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. కోదాడ-జడ్చర్ల హైవేపై సోమవారం సాయంత్రం లారీ, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా ద్విచక్రవాహనం నడుపుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం చారకొండకు చెందిన కొండ్ర శివగా సోమవారమే గుర్తించామన్నారు. అయితే ఈ ఘటనలలో శివ వెంట ఉన్న మహిళ మృతిచెందగా ఆమె ఆచూకీ వివరాలు మంగళవారం తెలిశాయన్నారు. మృతురాలు మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి గ్రామానికి చెందిన చాపల మాధవి(32)గా సీఐ తెలిపారు. వివాహిత అని మాధవి పత్తి సంచుల కోసం దేవరకొండ, చారకొండకు వచ్చిందని సీఐ తెలిపారు. మాధవి అక్క కుమారుడు మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చింతపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయయ్యాయి. మండలంలోని నసర్లపల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి వెంకటయ్య, సంధ్య ద్విచక్రవాహనంపై చింతపల్లికి పనికోసం వచ్చారు.తిరిగి స్వగ్రామానికి పయనమయ్యారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి దేవరకొండకు వెళ్తున్న కారు అదుపుతప్పి మైసమ్మ ఆలయ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్సనిమిత్తం దేవరకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు.

మళ్లీ తెరుచుకున్న సాగర్ గేట్లు

● సాగర్ 22 గేట్ల ద్వారా నీటి విడుదల



దిగువకు కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు 22 క్రస్ట్ గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువనుంచి వరద తగ్గటంతో ఈ నెల 5వ తేదీన గేట్లు మూసివేయగా, వరద రాక పెరగటంతో మంగళవారం గేట్లు ఎత్తారు. ఈ నీటి సంవత్సరంలో జూలై 29వ తేదీన మొదటిసారి, ఆగస్టు 13వ తేదీన రెండో సారి, సెప్టెంబరు 7వ తేదీన మూడోసారి, 21వ తేదీన నాలుగోసారి గేట్లు తెరుచుకోగా, తాజాగా ఐదో సారి మంగళవారం గేట్లు ఎత్తారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 589.70 అడుగులుగా (311.1486టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,022 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 32,642 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని, 22 క్రస్ట్ గేట్ల నుంచి 1,77,518 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,29,422 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువనుంచి 2,29,422 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

కొనసాగుతున్న మూసీ ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువనుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో రోజుల తరబడి విస్తారంగా కురిసిన వర్షాలకు నిండిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల గేట్లు ఎత్తడంతో ఉగ్రరూపం దాల్చిన మూసీ నది రెండు రోజుల క్రితం నెమ్మదించింది. ఈ క్రమంలో గత ఆది, సోమవారాల్లో ప్రాజెక్టు ఇన్‌ఫ్లో సాధారణ స్థితికి చేరింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడం, ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌ల గేట్లు ఎత్తడంతో సోమవారం ఉదయం నుంచి మూసీకి ఇన్‌ఫ్లోలో పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి 6,060.91 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం సాయంత్రానికి కొంతమేర తగ్గి 5,854.59 క్యూసెక్కులుగా నమోదైంది. రాబోయే రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే వీలుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

లైసెన్స్ సర్వేయర్లు వచ్చేస్తున్నారు!



● ఉమ్మడి జిల్లాలో పూర్తయిన తొలిదశ అప్రెంటిస్‌షిప్
● మొదటి విడతలో 670 మంది ఉత్తీర్ణత
● కోడ్ ముగిశాక సర్వేయర్ల ఉద్యోగ నోటిఫికేషన్..?
● అప్పటివరకు లైసెన్స్ సర్వేయర్లుగా కేటాయింపు
● భూసర్వేలో లభించనున్న కాసింత ఊరట

భూ రికార్డుల శుద్ధీకరణ, హద్దుల నిర్ధారణ ప్రక్రియ కొన్నేళ్లుగా పెండింగ్‌లో పడుతోంది. సర్వేయర్ల కొరత కారణంగా భూ సర్వే సకాలంలో పూర్తిచేయకపోవడంతో దరఖాస్తులు పెట్టుకున్న వారంతా జిల్లా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండలాల్లో సర్వేయర్ల కొరత అధికమైన నేపథ్యంలో భూవివాదాలకు పరిష్కారం లభించక గ్రామాల్లో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్)

సర్వేయర్ల కొరతను కొంత మేరకు పరిష్కరించే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే ఐటీఐ, ఇంజనీరింగ్ విద్యలో ల్యాండ్ సర్వే, రికార్డ్స్‌కు సంబంధించిన కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్ ఇప్పించేందుకు జూలైలో నోటిఫికేషన్ జారీచేసి, అదే నెల 26, 27, 28 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పరీక్ష నిర్వహించారు. అందులో ఉత్తీర్ణత సాధించిన వారందరికీ 50 రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించి సెప్టెంబర్ 25న తరగతుల్లో నేర్చుకున్న అంశాలపై పరీక్ష నిర్వహించి ఫలితాలు సైతం విడుదల చేశారు.

ఉమ్మడి జిల్లాలో రెండు బ్యాచ్‌లుగా..

ఉమ్మడి జిల్లాలో రెండు బ్యాచ్‌లుగా మొదలైన అప్రెంటిస్‌షిప్ ప్రస్తుతం మొదటి బ్యాచ్ పూర్తికాగా, రెండోబ్యాచ్ శిక్షణ కొనసాగుతోంది. భూ భారతి చట్టాన్ని తెచ్చిన ప్రభుత్వం వివాదాలు తలెత్తకుండా సాగుభూముల సర్వే, రిజిస్ట్రేషన్లు కొనసాగేలా చర్యలు చేపట్టేందుకు సిద్ధపడింది. ప్రస్తుతం రెవెన్యూశాఖలో పనిచేస్తున్న ప్రభుత్వ సర్వేయర్లు రెండు మండలాలకు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. దీంతో సమయానుకూలంగా భూసర్వే పూర్తిచేసి వివాదాలను పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు సర్వేయర్ల నియామకానికి ప్రభుత్వం సిద్ధపడింది. దీంతో కొన్నేళ్లుగా సర్వేయర్ పోస్టులకోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు అప్రెంటిస్‌షిప్ కోసం భారీసంఖ్యలో దరఖాస్తు చేసుకొని శిక్షణ పొందుతున్నారు.

క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న శిక్షణ

భూ సర్వే, ల్యాండ్ రికార్డు పరిశీలనలో ఎదురయ్యే సవాళ్లను దీటుగా ఎదుర్కోవడంలో పాటించాల్సిన అంశాలపై అప్రెంటిస్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి అధికారులు శిక్షణ ఇస్తున్నారు. సర్వే అంటే ఏమిటీ.. ఎన్ని రకాలు..? పురాతన కాలంలో ఎలా చేశారు, ప్రస్తుతం అందుబాట్లోకి వచ్చిన ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి ఎలా సర్వే చేయాలి. బ్రిటీష్‌కాలం నాటి సర్వే విధానం, ప్రసుత్తం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కొనసాగుతున్న డయాగ్నల్ అండ్ అఫ్‌సెట్, పట్టాదారు పుస్తకాల్లో నమోదు, నివేదికల రూపకల్పన, మ్యాప్ డిజైన్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడంతోపాటు థియరీ నేర్పిస్తున్నారు. శిక్షణ తొలిశలో అప్రెంటిస్‌షిప్ పూర్తిచేసిన వారికి ప్రభుత్వ భూముల్లో కొలతలు తీయడం, హద్దురాళ్లను నిర్ధారించడం, కొలతల మ్యాప్‌వంటి అంశాలపై క్షేత్రస్థాయి శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ మరో 40రోజుల వరకు ఇచ్చి ఆయా అంశాలపై పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులను ప్రకటిస్తారు. అన్ని విభాగాల్లో శిక్షణ పొంది అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారందరికీ ల్యాండ్ సర్వే, రికార్డు విభాగం అధికారులు లైసెన్స్ పత్రాలు జారీచేస్తారు.



లైసెన్స్ సర్వేయర్లుగా కేటాయింపు

ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ శాఖలో సర్వేయర్ల కొరత తీవ్రతరమైంది. పదేళ్ల క్రితం నామమాత్రంగా ఉన్న సర్వేయర్ల కొరత ప్రస్తుతం రెండంకెల సంఖ్యను దాటేసింది. నల్లగొండ జిల్లాల్లో 12 పోస్టులు ఖాళీగా ఉండగా, సూర్యాపేటలో 8, యాదాద్రిలో 5 సర్వేయర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా మండలాల్లో భూ సమస్యలను పరిష్కరించడంలో కాలయాపన జరుగుతోంది. ప్రధానంగా హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లాలో సరిహద్దు వివాదాలతోపాటు, అటవీ, కాందీశీకుల భూముల హద్దుల గుర్తింపు సమస్య అధికంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా ఫారెస్ట్ ఏరియా అధికంగా విస్తరించి ఉన్న నల్లగొండ జిల్లాలోని కృష్ణపట్టి ప్రాంతాల్లోనూ భూ సరిహద్దు వివాదాలు అధికంగా వస్తున్నాయి. సూర్యాపేట జిల్లాలోనూ ఇదే సమస్యతో కూడిన అర్జీలు పెడుతున్నారు. అయితే ప్రభుత్వ సర్వేయర్ల కొరత కారణంగా ఆయా సమస్యలను రికార్డుపరంగా పరిష్కరించడంలో తీవ్రజాప్యం జరుగుతోంది. దీంతో పదుల సంఖ్యలో వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారమార్గం లభించక బాధితులు నిత్యం కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతూ డీలా పడుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చింది. ప్రస్తుతం అప్రెంటిస్‌షిప్ పూర్తిచేసిన అభ్యర్థుల్లో ఉత్తీర్ణత సాధించిన వారిని మెరిట్ ప్రకారం లైసెన్స్ సర్వేయర్లుగా మండలాలకు కేటాయించాలని భావించింది. నల్లగొండ జిల్లాకు 248 మంది, సూర్యాపేట జిల్లాకు 184, యాదాద్రి భువనగిరి జిల్లాకు 136 మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించనున్నారు. ఈ ప్రక్రియ కార్యరూపం దాల్చితే సర్వే చిక్కులకు ఊరట లభించి మండల, గ్రామస్థాయిలో భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

1,269 మందికి అప్రెంటిస్‌షిప్

ల్యాండ్ సర్వే, రికార్డు నిర్ధారణ విభాగంలో అప్రెంటిస్‌షిప్ ఇప్పించేందుకు జూలైలో నిర్వహించిన పరీక్షలో ఉమ్మడి జిల్లా నుంచి 1,269 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరందరికీ జిల్లాల వారీగా రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టి ఇప్పటికే మొదటి విడత శిక్షణ పూర్తిచేశారు. మొదటి దశలో 670 మంది అభ్యర్థులు శిక్షణ పూర్తిచేసుకొని క్షేత్రస్థాయి శిక్షణ పొందుతున్న వారిలో నల్లగొండ జిల్లాలో 299 మంది, సూర్యాపేట జిల్లాలో 230, యాదాద్రి భువనగిరి జిల్లాలో 150 మంది అప్రెంటిస్‌షిప్ పూర్తిచేసి క్షేత్రస్థాయి శిక్షణలో ఉన్నారు. రెండో విడతగా నల్లగొండ జిల్లాలో 250 మంది, సూర్యాపేటలో 230, యాదాద్రి భువనగిరిలో 120మంది అప్రెంటిస్‌షిప్ శిక్షణలో ఉన్నారు. ఒక్కో ప్రభుత్వ సర్వేయర్‌కు 25 మందిని కేటాయించి అన్ని సర్వే విభాగాల్లో శిక్షణ అందిస్తున్నారు.

మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది

ప్రభుత్వ ఆదేశాల మేరకు అప్రెంటిస్‌షిప్ శిక్షణ కొనసాగుతోంది. ఇప్పటకే తొలిదశలో 299 మందికి శిక్షణ పూర్తిచేసి అర్హత పరీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణత సాధించిన వారందరికీ లైసెన్స్‌లు జారీచేస్తాం. ల్యాండ్ సర్వేలో పరిపూర్ణత సాధించాలంటే కనీసం నాలుగు నుంచి ఆరునెలల పాటు క్షేత్రస్థాయిలో పనిచేయాలి. అయితే మండలాల్లో బాధ్యతలు అప్పగించే విషయంలో ప్రభుత్వం నుంచి మార్గదర్శలు వెలువడాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాలు, నియమ నిబంధనలకు లోబడి లైసెన్స్ సర్వేయర్ల నియామకం ఉంటుంది.

దేవరాజు, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ, నల్లగొండ

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నృసింహక్షేత్రంలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్యకల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. యాదగిరీశుడి కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసి తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాతసేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్య తిరుకల్యాణపర్వాలను వైభవంగా నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.14,48,189 ఆదాయం సమకూరినట్లు ఇంచార్జి ఈవో రవి నాయక్ తెలిపారు.



నాగవల్లీ దళార్చనలు నిర్వహిస్తున్న అర్చకులు, శరత్ పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరీశుడికి స్వర్ణ పూత ప్రభ సమర్పణ

హైదారాబాద్‌కు చెందిన భక్తులు లక్ష్మీనృసింహుడికి రూ. 3లక్షల విలువైన స్వర్ణ పూత ప్రభను అందజేశారు. ఖడ్గేకార్ జగదీశ్వర్ భాగ్యవతి, వినయ్ ఈషా, గరుడపల్లి బాలేష్ గుప్తా అన్నపూర్ణ దేవి, శివప్రసాద్-స్రవంతి దంపతులు కుటుంబ సమేతంగా మంగళవారం సుమారు రూ.3లక్షల విలువైన బంగారు (రాగి రేకులపై) పూత ప్రభను సమర్పించారు. ఇందుకు సంబంధించిన పత్రాన్ని ఆలయ ఏఈవో రఘుకు అందజేశారు.

కుంచెతో నమూనా..



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ నమూనాను కుంచెతో రూపొందించి ఔరా! అనిపించింది జిల్లా కేంద్రం భువనగిరికి చెందిన చిత్రకారిణి లావణ్య. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆలయాలు, చారిత్రక కట్టడాలను గీయడమే తన లక్ష్యమని ఆర్టిస్టు లావణ్య తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు ఈ బొమ్మను గీసినట్లు లావణ్య తెలిపారు.

ఆలయంలో శరత్ పౌర్ణమి వేడుక

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శరత్ పౌర్ణమి వేడుకలు వైభవంగా కొనసాగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి, ఆలయ ప్రాకార మండపంలో ఊరేగింపు నిర్వహించారు. వేదమంత్రాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ చతుర్వేద, ప్రబంధ పారాయణాలు చేశారు. చంద్రకాంతిలో భక్తులు ప్రత్యేక ప్రసాదాలు, ఖీర్ (పాల పాయసం) సేవించారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు వెంకటాచార్యులు పాల్గొన్నారు.

ప్రాణాపాయం నుంచి గట్టెక్కింది



కుక్కపిల్లకు వైద్యం చేస్తున్న డాక్టర్ పెంటయ్య

కోదాడ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వైరస్ బారిన పడిన కుక్కపిల్లను ప్రాణాపాయం నుంచి కాపాడినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన ఇర్ల నర్సిరెడ్డి రెండు నెలల కుక్కపిల్ల పార్వో వైరస్ అనే అంటువ్యాధితో వాంతులు, రక్త విరేచనాలతో బాధపడుతుంది. ఆహారం తీసుకోలేకపోవడం, శరీరం బక్క చిక్కిపోవడంతో వైద్యంకోసం పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకొచ్చారు. పరీక్షించిన అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య వైద్యంచేసి రక్తం ఎక్కించారు. ఆరోగ్యంగా ఉన్న రెండు కుక్కల ద్వారా రక్తం సేకరించి వ్యాధితో బాధపడుతున్న కుక్కపిల్లకు రక్తం ఎక్కించారు. చికిత్స అనంతరం కుక్కపిల్ల ఆరోగ్యంగా ఉందని పెంటయ్య తెలిపారు. కుక్కలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్రకళ, అఖిల్, సాగర్ పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన జిల్లా టీడీపీ నేతలు

నల్లగొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన బి.శివధర్‌రెడ్డిని టీడీపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి మంగళవారం కలిశారు. హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన డీజీపీని శాలువాతో సత్కరించి, పూల మొక్క అందజేశారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



డీజీపీ శివధర్‌రెడ్డిని సన్మానిస్తున్న శేఖర్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మర్రిగూడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చర్లగూడెం రిజర్వాయర్‌లో భూములు, ఇళ్లు కోల్పోతున్న తమకు ఇందిరమ్మ పథకం ద్వారా ప్రత్యేక కోటా ఇళ్లు ఇవ్వాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం నర్సిరెడ్డిగూడెం భూనిర్వాసితులు బుధవారం చర్లగూడెం రిజర్వాయర్ కట్ట పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా భూనిర్వాసితులు పెరమళ్ల చంద్రయ్య, అయితగోని వెంకటయ్య, లోడ యాదయ్యతోపాటు పలువురు రైతులు మాట్లాడుతూ చర్లగూడెం రిజర్వాయర్‌లో నర్సిరెడ్డిగూడెం పూర్తిగా ముంపునకు గురైనందున అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలన్నారు. విషయం తెలుసుకున్న ప్రాజెక్టు ఇన్‌చార్జిలు కృష్ణారెడ్డి, మనోహర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. ప్రాజెక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి 15 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని నిర్వాసితులకు హామీ ఇచ్చారు. దీంతో నిరసనను విరమించుకొని బాధితులు వారి ఇళ్లకు వెళ్లగా, తిరిగి రిజర్వాయర్ పనులు కొనసాగాయి.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

● కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తలు

చింతలపాలెం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తలు సూచించారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో రైతుల పంటలను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డి.నరేష్, ఎ.కిరణ్, రైతులు రాంబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి భవాని, విద్యార్థులు పద్మావతి, సుస్మిత, శరణ్య పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

13న జాతీయ పురస్కారాల ప్రదానం

● సుద్దాల జానకమ్మ హన్మంతు జ్ఞాపకార్థంగా అందజేత : ప్రభాకర్ తేజ

మోత్కూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుద్దాల జానకమ్మ హనుమంతు జాతీయ పురస్కారాలను ఈ నెల 13న ప్రదానం చేయనున్నట్లు సుద్దాల ప్రభాకర్ తేజ తెలిపారు. మంగళవారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రముఖ సినీ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ ఆధ్వర్యంలో ఏటా ఇస్తున్న జాతీయ సాహితీ, జానపద, నృత్య పురస్కారాలను హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ప్రముఖ రచయిత్రి వోల్గా, జానపద, సినీ గాయని మధుప్రియ, నర్తకి లాలీనిధి పురస్కారాలకు ఎంపికయ్యారన్నారు. పురస్కారాల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ సూరేపల్లి నంద, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, ప్రముఖ వక్త ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు, రాష్ట్ర ప్రభుత్వ మాజీ వాస్తు సలహాదారు సుధాకర్ తేజ పాల్గొంటారన్నారు. ఈ జాతీయ పురస్కారాల ప్రదానం 13 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌తేజ

విభిన్నంగా తల్లి ఒడి పండుగ

సుద్దాల హనుమంతు జానకమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సుద్దాల అశోక్ తేజ ఆలోచనతో ఏటా తల్లి ఒడి పండుగ నిర్వహిస్తున్నామన్నారు. తమ ప్రాంతంలో ఏడాదిలో పుట్టిన చిన్నారులు, వారి తల్లులను గౌరవిస్తూ వారికి నూతన వస్త్రాలు పెట్టి సన్మానిస్తున్నామన్నారు. తొమ్మిదేళ్లుగా ఈ పండుగను గుండాల మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

వాల్మీకి మహర్షి సేవలు అద్వితీయం

● సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



సూర్యాపేటలో వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని ధర్మం వైపు నడిపించడంలో వాల్మీకి చేసిన సేవలు అద్వితీయమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు పాల్గొన్నారు.

సూర్యాపేటక్రైం: వాల్మీకి జీవితం ఆదర్శనీయమని ఎస్పీ నర్సింహ అన్నారు. మంగళవారం వాల్మీకి జయంతి పురస్కరించుకొని పోలీస్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవీందర్‌రెడ్డి, జనార్ధన్ రెడ్డి, డీఎస్పీ నర్సింహాచారి, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌రామారావు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: వాల్మీకి జయంతి వేడుకలను నేరేడుచర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి మునిసిపల్ కమిషనర్ యడవెల్లి అశోక్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

భానుపురి: సూర్యాపేట జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ఎస్ఈ ఫ్రాంక్లిన్‌తోపాటు నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, 1104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేతకాని వెంకన్న పాల్గొన్నారు.

నూతనకల్: వాల్మీకి జయంతిని తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆర్ఐ హసన్ పాల్గొన్నారు.

చిలుకూరు: చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీవో ముక్కపాటి నర్సింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: మహర్షివాల్మీకి జయంతిని పురస్కరించుకొని భువనగిరి మునిసిపల్ కార్యాలయంలో ఘననివాళులర్పించారు. కమిషనర్ జి.రామలింగం, డీఈ కొండల్‌రావు, మేనేజర్ నరేష్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్‌పైలెట్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం), వలిగొండ: మహర్షి వాల్మీకి జయంతి, కొమరం భీమ్ వర్ధంతిని మంగళవారం ఆత్మకూరు(ఎం), వలిగొండ మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులు నిర్వహించారు. కార్యక్రమాల్లో రాములు, లోకేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రదీప్, జలంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

8

బుధవారం 8 అక్టోబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	2,99,853	1,33,853
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.05 (4.21)	5,854.59	6,318.12
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.209 (41.5360)	1,15,500	1,62,470

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

పత్తి రైతు డీలా



» జిల్లాలో వరుస వర్షాలు

» తడుస్తున్న పత్తి, ప్రారంభంకాని సీసీఐ

» ప్రైవేట్ వ్యాపారులకు పత్తి విక్రయించి నష్టపోతున్న రైతులు

జిల్లాలో పత్తి చేతికొచ్చే దశలో వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి విక్రయించాలంటే ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను నేటికీ ప్రారంభించలేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో రైతులు వ్యాపారులు చెప్పిన ధరకు విక్రయించి నష్టపోతున్నారు. ప్రభుత్వం సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి సేకరణకు క్వింటాకు రూ.8వేలకుపైగా మద్దతు ధర ప్రకటించినా, నేటికీ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు వ్యాపారులకే విక్రయిస్తున్నారు. వ్యాపారులు క్వింటాకు రూ.5,500 నుంచి రూ.6,000 మాత్రమే ధర చెల్లిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

జిల్లాలో 5.68లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగుచేశారు. ఎకరానికి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పత్తి దిగుబడి చేతికొచ్చే సమయానికి వరుసగా వర్షాలు కురుస్తుండడంతో పింజలు తడుస్తున్నాయి. దీంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి ఏపుగా పెరిగి, దిగుబడులు కూడా వస్తుండగా, సీసీఐ నేటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. ఇదే అదునుగా వ్యాపారులు కొందరు గ్రామాలకు వెళ్లి నేరుగా రైతుల వద్దనే పత్తి కొనుగోలుచేస్తున్నారు. ఇంటి ముందుకు వచ్చి వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో రవాణా ఖర్చు తగ్గుతుండటంతోపాటు నిల్వచేసే ఇబ్బంది తొలగుతుందని వారు చెప్పిన ధరకే విక్రయించి నష్టపోతున్నారు.

రైతులను మోసం చేస్తున్న దళారులు

కొంతమంది వ్యాపారులు, దళారులు డివిజన్‌లోని పల్లెల్లో తిరుగుతూ రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు రూ.5,500 నుంచి రూ.6వేల వరకు విక్రయిస్తున్నారు. పత్తి తడిచిందని క్వింటాకు మూడు కిలోల వరకు తరుగు తీస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు పత్తి చేతికొచ్చే సమయానికి వర్షాలు కురుస్తుండడంతో తడిసిపోతుండడం, పంటచేలల్లో వరద నిలుస్తుండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తడిసిన పత్తికి తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

సీసీఐ కేంద్రాలు తెరవాలి



నేను నాలుగు ఎకరాల్లో రూ.1.70లక్ష వరకు పెట్టుబడులు పెట్టి పత్తి సాగుచేశా. పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు కురిసి పత్తి తడిసింది. వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలి.

- సుందర్‌జీ, పత్తి రైతు, పోలేపల్లి, చందంపేట

వ్యాపారులకు విక్రయించవద్దు

రైతులు వ్యాపారులకు పత్తిని విక్రయించవద్దు. తీసిన పత్తిని తడిలేకుండా నిల్వ చేసుకోవాలి. త్వరలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర అందజేసి కొనుగోలు చేస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు.

- రవీందర్‌రెడ్డి, దేవరకొండ మార్కెట్‌కమిటీ కార్యదర్శి

తనిఖీలు నిర్వహించని తునికలు కొలతల అధికారులు

వ్యాపారులు గ్రామాల్లో తిరుగుతూ పత్తి కొనుగోళ్ల సమయంలో తూకాలలో మోసాలకు పాల్పడుతున్నారు. తునికల కొలతలు, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో రైతులు వ్యాపారులకే పత్తిని విక్రయిస్తున్నారు. తునికల కొలతలు, టాస్క్‌ఫోర్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి రైతులకు మేలు చేసేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



కొట్టుకుపోయిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

డిండి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజలాల నీటి సరఫరా నిలిచిపోయిన మండలాలకు తాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. డిండి మండలం కందుకూరు వాగులో కృష్ణాజలాల పైప్‌లైన్ కొట్టుకుపోవడంతో ఆమె మంగళవారం పరిశీలించి తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్లు, స్కీం బోర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్), ప్రాథమిక వైద్యశాలను తనిఖీచేశారు. నూతనంగా నిర్మించిన ఈ టెక్నాలజీ సెంటర్‌లో నీటి లీకేజీ మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రాథమిక వైద్యశాలలో రోజువారి ఓపీ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ హనుమంతు శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో వెంకన్న, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



పంటను పరిశీలించి రైతుతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

మాడ్గులపల్లి, అక్టోబర్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గోపాలపురం గ్రామంలో రైతులు సాగు చేసిన వరి చేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో వరి కోతలు ప్రారంభమైనందున ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, వీటిని వినియోగించుకోవాలని అన్నారు. రైతులు రైస్ మిల్లర్లను, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అన్నారు. ఏ-గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 ప్రభుత్వం మద్దతు ధరగా ప్రకటించిందని, సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. రైతులు ధాన్యంలో తాలు లేకుండా, 17శాతం లోపు తేమ ఉండేలా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఏవో ఎం.శివరాంకుమార్, ఏఈవో వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో సీపీఎంను ఆదరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

కట్టంగూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి వచ్చే అభివృద్ధి శక్తులతో పనిచేస్తామని, సీపీఎం ఆదరించాలని పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. మంగళవారం కట్టంగూరులోని అమర వీరుల స్మారక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మతతత్వ పార్టీ బీజేపీని ఓడించేందుకు సీపీఎం ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రధాన అజెండాగా ముందుకెళ్తోందన్నారు. ఎన్నికల్లో పార్టీని ఆదరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, నాయకులు చిలుముల రామస్వామి, గడ్డగోజు రవీంద్రచారి, జాల రమేష్, ఉట్కూరు శ్రీను, జాల ఆంజనేయులు, రామస్వామి, గంటా వెంకన్న, సాగర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఘనంగా మాస కల్యాణం



చిట్యాలలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

చిట్యాలరూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వట్టిమర్తిలోని శ్రీవారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలను ఆలయ కమిటీ చైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోద అందజేశారు. ఉత్సవమూర్తులను పురోహితులు పట్టువస్త్రాలు, పూలమాలతో అలంకరించి కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయ మాజీ ప్రధానార్చకుడు నల్లందిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ అర్చకుడు అక్కినేపల్లి భీష్మాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఎల్ కంపెనీ సీఈవో హితీష్ అగర్వాల్, వైస్‌ప్రెసిడెంట్ అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి మండలంలో..

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): పౌర్ణమి తిథిని పురస్కరించుకుని మండలంలోని వైష్ణవ క్షేత్రం గోపలాయపల్లి వారిజాల వేణుగోపాల స్వామి దేవస్థానంలో మంగళవారం మాస కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకాగా, పూజల అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఉత్సవంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, రాజేశ్వరి దంపతులు పాల్గొన్నారు. అదేవిధంగా నార్కట్‌పల్లి వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో సుదర్శన హోమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో యాజ్ఞికులు కారంపూడి కృష్ణమాచార్యులు, కారంపూడి వేణాచార్యులు, రేపాల శివశంకర్, చైతన్య, రంగా కృష్ణయ్య, ధనమ్మ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను ఆమోదింపజేసే బాధ్యత బీజేపీదే

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు



నల్లగొండలో నిరసన తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

నల్లగొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్‌తో ఆమోదింపజేసే బాధ్యత బీజేపీదేనని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోర్టులను అడ్డం పెట్టుకొని బీసీ రిజర్వేషన్ల ప్రక్రియను ఆపాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తే రెడ్డి జాగృతికి చెందిన కొంతమంది కోర్టులను ఆశ్రయించి అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో బీసీలంతా ఏకమై రిజర్వేషన్ వ్యతిరేక శక్తులకు రాజకీయ సమాధి కట్టడం ఖాయమన్నారు. 50శాతం రిజర్వేషన్లు దాటకూడదని ఎక్కడా లేదని, అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో 10శాతం రిజర్వేషన్ కల్పించిన నాడే 50శాతం సీలింగ్ పోయిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కాసోజు విశ్వనాథం, నేలపట్ల సత్యనారాయణ, సోమ మల్లన్న, నకిరేకంటి కాశయ్య గౌడ్, కేశబోయిన శంకర్, వాసుదేవుల వెంకటనర్సయ్య, చిక్కుల రాములు, చొల్లేటి రమేష్, గంజి భిక్షమయ్య, ఆదినారాయణ, సాయిబాబా, శంకర్, దామోదర్, శంకరాచారి, సూర్యానారాయణ, శ్రీను, వేణు, లాలయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లును ఆమోదించాలి

(ఆంధ్రజ్యోతి, మునుగోడు): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు శాసనసభ ఆమోదించిన బిల్లుకు బేషరత్‌గా గవర్నర్ ఆమోద ముద్రవేయాలని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మునుగోడులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు రూ.2లక్షల రుణం ఇవ్వాలి

నకిరేకల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గీత కార్మికుడికి ప్రభుత్వం రూ.2లక్షల సబ్సిడీ రుణం ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెవుగోని సీతారాములు అన్నారు. మంగళవారం నకిరేకల్‌లో జరిగిన సంఘం మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 5లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నందున వారి సంక్షేమానికి ప్రభుత్వం రూ.5వేల కోట్లు కేటాయించి ఆదుకోవాలన్నారు. ప్రతీ గీత కార్మికుడికి రూ.2లక్షల రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పామునుగుంట్ల అచ్చాలు, జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, రాచకొండ వెంకట్‌గౌడ్, గుడుగుంట్ల బుచ్చిరాములు, కొప్పుల అంజయ్య, ఎరుకల అంజయ్య, పాల్గొన్నారు.

చెర్వుగట్టు మాజీ వార్డుసభ్యుడి మృతి

నార్కట్‌పల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు గ్రామ పంచాయతీ మాజీ వార్డుసభ్యుడు, బీఆర్‌ఎస్ నేత దొడ్డి నర్సింహ మంగళవారం మృతిచెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన మృతికి రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, మేకల రాజిరెడ్డి, మల్ల బాలకృష్ణ, కమ్మంపాటి వెంకటయ్య, మేకల కరుణాకర్‌రెడ్డి, బాలెంల బిక్షం, నేతకాని కృష్ణయ్య, వారాల రమేశ్, రేగట్టె నర్సిరెడ్డి సంతాపం తెలిపారు.

పంట యాజమాన్యంతోనే లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

కట్టంగూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పంట యాజమాన్యంతోనే రైతులు లాభాలు సాధిస్తారని కోణం ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ పత్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని రామచంద్రాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పత్తి రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని, ఎరువులు, పురుగుమందుల యాజమాన్యం పాటించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు అంజయ్య, పరుశురామ్, రైతులు చిట్టిమల్ల పాండు, కందుల లింగస్వామి, నీలం నాగయ్య, శ్రీను, సాయిలు, సూర్య, రమేష్, అనామతుల నాగయ్య, పొడిచేటి యాదయ్య, బోయపల్లి పెద్ద యాదయ్య, వెంకన్న, సైదులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను అనుకూలంగా మార్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మర్రిగూడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను అనుకూలంగా మార్చుకొని పార్టీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో గ్రూపుల రాజకీయాలు చేయకుండా శ్రేణులు ఐక్యతగా ఉండాలని సూచించారు. పార్టీకి విధేయులుగా ఉంటూ అధిష్ఠానం ఆదేశాలనుసారంగా ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి అభ్యర్థులను గెలిపించాలన్నారు. మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచుల అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు బచ్చు రామకృష్ణ, రామిడి వెంకటరమణారెడ్డి, దంటు జగన్, మెండు మోహన్‌రెడ్డి, అనంతరాజుగౌడ్, గండికోట హరికృష్ణ, కట్కూరి వెంకటేష్ గౌడ్, మునగాల అంతిరెడ్డి, దేశిడి సురేందర్‌రెడ్డి, ఊరుపక్క నగేష్, అయిలి నరసింహ, నల్ల యాదయ్య, లింగం గౌడ్, పందుల యాదయ్య, మారగోని వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలను చూడడమే బీఐఎస్ లక్ష్యం

బీఐఎస్ డైరెక్టర్ సుజాత



సమావేశంలో మాట్లాడుతున్న బీఐఎస్ డైరెక్టర్ సుజాత

నల్లగొండ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అందించే ఉత్పత్తులు, సేవల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడడమే భారత నాణ్యత ప్రమాణాల సంస్థ (బీఐఎస్) లక్ష్యమని సంస్థ హైదరాబాద్‌శాఖ డైరెక్టర్ కె.సుజాత అన్నారు. మంగళవారం నల్లగొండలో నిర్వహించిన బీఐఎస్. భాగస్వామ్యపక్షాల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో అత్యధికంగా 7,600 ఉత్పత్తులకు బీఐఎస్ ప్రమాణాలు ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఐఎస్ఐ హాల్‌మార్క్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. జిల్లా పరిశ్రమల్లో పాటిస్తున్న భద్రతా ప్రమాణాలను జిల్లా ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేవీ.శ్రీదేవి వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్మికశాఖ సహాయ అధికారి రాజు, బీఐఎస్ అధికారి అభిషేక్, వినియోగదారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆలే వెంకటేశ్వర్లు, చింతమల్ల గురవయ్య, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, మట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : డీఈవో



అవంతీపురం కేజీబీవీలో స్టోర్‌రూమ్‌ను పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. మంగళవారం మండలంలోని అవంతీపురం కేజీబీవీని ఆయన తనిఖీచేసి పాఠశాల ఆవరణ, వంట గదిని పరిశీలించారు. వర్షాకాలంలో పాఠశాల ఆవరణ, వంటగదిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థినులకు పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పదో తరగతి విద్యార్థినులకు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంఈవో బాలు, పాఠశాల ఎస్‌వో పార్వతి, తదితరులు ఉన్నారు.

'స్థానిక సంస్థల్లో ఎక్కువ స్థానాల్లో గెలుస్తాం'

నార్కట్‌పల్లి, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో మెజార్టీ స్థానాలు గెలుస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నార్కట్‌పల్లిలో మంగళవారం సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని ప్రగల్భాలు పలికిందని కానీ 600 రోజులనైనా ఆ హామీలు పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను, మోసపూరిత వాగ్దానాలను ప్రతీ ఇంటికి తీసుకెళ్లి వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల కోసం పాటు పడాలన్నారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు పాల్వాయి భాస్కర్‌రావు, నడింపల్లి శ్రవణ్‌కుమార్, మునుకుంట్ల గణేశ్, బిల్లకంటి శ్రీకాంత్, రూపని సత్యనారాయణ, నోముల నాగరాజు, ఎడమ పురుషోత్తంరెడ్డి, తోటకూరి శివ, మేడి గణేశ్, పాలకూరి రమేశ్, వడ్డేగోని రామలింగం, నడింపల్లి పార్థసారథి, రావుల తిరుమలేశ్, బొల్లెద్దు రామలింగం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

మర్రిగూడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన వివిధ పనులపై నేటి నుంచి సామాజిక బృందంతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు మర్రిగూడ ఉపాధిహామీ పథకం ఏపీవో జయరాజు తెలిపారు. మంగళవారం ఉపాధిహామీ పథకం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2024 ఏప్రిల్ 2025 మార్చి ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలో 20 గ్రామపంచాయతీ పరిధిలో రూ.6.40కోట్లతో ఉపాధిహామీ పథకం ద్వారా ఉపాధి కూలీల చేత చేపట్టిన వివిధ పనులపై ఈ బృందం సామాజిక తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ మండలంలో ఆర్థిక సంవత్సరానికి భూమి అభివృద్ధి, గుట్టల వద్ద కందకాలు, కాలువలు, కాలువల పూడికలు, ఇంకుడు గుంతలు, పండ్ల తోటలు, నర్సరీలు, వ్యవసాయ రోడ్లు, పశువుల పాకలు, ఫారం పాండ్లను ఈ నిధులతో పనులు చేసినట్లు వెల్లడించారు.

స్థానిక సంస్థల్లో టీడీపీ జెండా ఎగురవేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మర్రిగూడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరవేస్తామని ఆ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి దోమల వెంకన్న అన్నారు. మంగళవారం మర్రిగూడలో విలేకరులతో మాట్లాడుతూ గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలో గత టీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్తామన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకు నమ్మకం లేకుండా పోయిందని టీడీపీ గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు టీడీపీ అభ్యర్థులను బరిలో నిలుపుతామన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల యాదయ్య, శ్రీను పోలే మల్లయ్య, వీరమల్ల మల్లేష్, చిన్న సత్యనారాయణరెడి తదితరులు ఉన్నారు.

పీఆర్‌పీఎస్ అభ్యర్థులను గెలిపించాలి

నకిరేకల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా పోరాట సమితి (పీఆర్‌పీఎస్)అభ్యర్థులను గెలిపించాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి అన్నారు. నకిరేకల్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు ధన, అధికార ప్రభావంతో గెలిచేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని పీఆర్‌పీఎస్ కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో పాల్వాయి వెంకటేశ్వర్లు, దుర్గం కాంతయ్య, మేడి సైదులు, జిల్లా శేఖర్, యారా రామలింగయ్య, దండెబోయిన కుమార్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

మునుగోడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి కోరారు. మునుగోడు మండల కేంద్రంలోని రామకృష్ణపురం ఆవాస గ్రామానికి చెందిన బీసం కృష్ణయాదవ్ తన అనుచరులతో కలిసి మంగళవారం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బిక్షంగౌడ్, మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్యయాదవ్, భవనం మధుసూదన్‌రెడ్డి, బొడిగె అశోక్‌గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పులకరం సైదులు, జిల్లా నాయకులు గోలి లింగస్వామి, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి బండారు యాదయ్య పాల్గొన్నారు.




జనహృదయనేత జయవీర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



జనహృదయనేత జయవీర్‌కి జన్మదిన శుభాకాంక్షలు
జనం మెచ్చిన నేత, జనంకోసం తపించే యువ నాయకుడు,
ప్రజా సేవకుడు, నిగర్వి, నిస్వార్థపరుడు, స్నేహశీలి,
నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా
బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం
నిరంతరం శ్రమిస్తున్న మృదు స్వభావి
నాగార్జున సాగర్ శాసన సభ్యులు
శ్రీ కుందూరు జయవీర్‌రెడ్డి గారికి
ఇవే మా జన్మదిన శుభాకాంక్షలు...
శ్రీ కుందూరు జయవీర్‌రెడ్డి గారు
శాసనసభ్యులు నాగార్జునసాగర్
శ్రీ కుందూరు రఘువీర్‌రెడ్డి గారు
ఎంపీ, నల్లగొండ
కేంద్ర ఇందనశాఖ పార్లమెంటరీ
స్థాయి సంఘం సభ్యులు
హాలియా, నిడమనూరు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్
చిట్టిప్రోలు యాదగిరి, అధ్యక్షులు
పేలపూడి బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి
చేకూరి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు
వజ్రతేజ రైస్ క్లస్టర్స్ ప్రై.లి., హాలియా
శ్రీ రాఘవసాయి రైస్ ఇండస్ట్రీస్, నిడమనూరు
దివ్యశ్రీ రైస్ ఇండస్ట్రీస్, హాలియా
శ్రీ బాలాజీ రైస్ ఇండస్ట్రీస్, హాలియా
హరికృష్ణ రైస్ ఇండస్ట్రీస్, నిడమనూరు
రాజేంద్ర రైస్ ఇండస్ట్రీస్, నిడమనూరు
లోకేశ్వరి రైస్ కార్పోరేషన్, నిడమనూరు
కనకమహాలక్ష్మి రైస్ ఇండస్ట్రీస్, హాలియా
శ్రీ ఆంజనేయ రైస్ ఇండస్ట్రీస్, హాలియా
తిరుమల రైస్ ఇండస్ట్రీస్, హాలియా
లక్ష్మి నారాయణ రైస్ ఇండస్ట్రీస్, హాలియా
అమ్మ రైస్ మిల్, తెప్పలమడుగు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
8
బుధవారం 8 అక్టోబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	2,99,853	1,33,853
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.05 (4.21)	5,854.59	6,318.12
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.209 (41.5360)	1,15,500	1,62,470

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

మెరుగైన వైద్యసేవలు అందిస్తాం



దేవరకొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రోగులకు అధునాతన పద్ధతిలో చికిత్స అందిస్తున్నామని మలక్‌పేట యశోద ఆసుపత్రి డాక్టర్ రంజిత్‌కుమార్ ఆనందసు, డాక్టర్ ఎం.ఈ. చంద్రమౌళి తెలిపారు. మంగళవారం దేవరకొండలో వారు మాట్లాడారు. పీఏపల్లి మండలం చింతల్‌తండాకు చెందిన రమేష్ అనే గిరిజన యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై ఎడమ చేతికి రక్తప్రసరణ పూర్తిగా ఆగిపోయిందని, రక్త నాళాలతోపాటు ముఖ్యమైన నాళాలు తెగిపోయాయని తెలిపారు. యంజియోగ్రామ్ ద్వారా గుర్తించి అరుదైన బ్రాకియల్ అర్టరి వెరియేషన్ చేసి యువకుడి చేతిని కాపాడి ప్రాణాలు నిలబెట్టినట్లు తెలిపారు. సమావేశంలో డాక్టర్ అరవింద్, గుత్తా శశిధర్‌రెడ్డి, వాసుకిరణ్‌రెడ్డి, ఓరుకంటి పవన్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస సిదూర పాల్గొన్నారు.

పత్తి రైతు డీలా



దేవరకొండ డివిజన్‌లో పత్తి చేతికొచ్చే దశలో వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి విక్రయించాలంటే ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను నేటికీ ప్రారంభించలేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో రైతులు వ్యాపారులు చెప్పిన ధరకు విక్రయించి నష్టపోతున్నారు. ప్రభుత్వం సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి సేకరణకు క్వింటాకు రూ.8వేలకుపైగా మద్దతు ధర ప్రకటించినా, నేటికీ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు వ్యాపారులకే విక్రయిస్తున్నారు. వ్యాపారులు క్వింటాకు రూ.5,500 నుంచి రూ.6,000 మాత్రమే ధర చెల్లిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,దేవరకొండ)

- దేవరకొండ డివిజన్‌లో వరుస వర్షాలు
- తడుస్తున్న పత్తి, ప్రారంభంకాని సీసీఐ
- ప్రైవేట్ వ్యాపారులకు పత్తి విక్రయించి నష్టపోతున్న రైతులు

దేవరకొండ డివిజన్‌లో 1.70లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగుచేశారు. ఎకరానికి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పత్తి దిగుబడి చేతికొచ్చే సమయానికి వరుసగా వర్షాలు కురుస్తుండడంతో పింజలు తడుస్తున్నాయి. దీంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి ఏపుగా పెరిగి, దిగుబడులు కూడా వస్తుండగా, సీసీఐ నేటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. ఇదే అదునుగా వ్యాపారులు కొందరు గ్రామాలకు వెళ్లి నేరుగా రైతుల వద్దనే పత్తి కొనుగోలుచేస్తున్నారు. ఇంటి ముందుకు వచ్చి వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో రవాణా ఖర్చు తగ్గుతుండటంతోపాటు నిల్వచేసే ఇబ్బంది తొలగుతుందని వారు చెప్పిన ధరకే విక్రయించి నష్టపోతున్నారు.

రైతులను మోసం చేస్తున్న దళారులు

కొంతమంది వ్యాపారులు, దళారులు డివిజన్‌లోని పల్లెల్లో తిరుగుతూ రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు రూ.5,500 నుంచి రూ.6వేల వరకు విక్రయిస్తున్నారు. పత్తి తడిచిందని క్వింటాకు మూడు కిలోల వరకు తరుగు తీస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు పత్తి చేతికొచ్చే సమయానికి వర్షాలు కురుస్తుండడంతో తడిసిపోతుండడం, పంటచేలల్లో వరద నిలుస్తుండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తడిసిన పత్తికి తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

సీసీఐ కేంద్రాలు తెరవాలి



నేను నాలుగు ఎకరాల్లో రూ.1.70లక్ష వరకు పెట్టుబడులుపెట్టి పత్తి సాగుచేశా. పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు కురిసి పత్తి తడిసింది. వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలి.

- సుందర్‌జీ, పత్తి రైతు, పోలేపల్లి, చందంపేట

వ్యాపారులకు విక్రయించవద్దు

రైతులు వ్యాపారులకు పత్తిని విక్రయించవద్దు. తీసిన పత్తిని తడిలేకుండా నిల్వ చేసుకోవాలి. త్వరలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర అందజేసి కొనుగోలు చేస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు.

- రవీందర్‌రెడ్డి, దేవరకొండ మార్కెట్‌కమిటీ కార్యదర్శి

తనిఖీలు నిర్వహించని తునికలు కొలతల అధికారులు

వ్యాపారులు గ్రామాల్లో తిరుగుతూ పత్తి కొనుగోళ్ల సమయంలో తూకాలలో మోసాలకు పాల్పడుతున్నారు. తునికల కొలతలు, టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో రైతులు వ్యాపారులకే పత్తిని విక్రయిస్తున్నారు. తునికల కొలతలు, టాస్క్‌ఫోర్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి రైతులకు మేలు చేసేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

మాడ్గులపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గోపాలపురం గ్రామంలో రైతులు సాగు చేసిన వరి చేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో వరి కోతలు ప్రారంభమైనందున ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, వీటిని వినియోగించుకోవాలని అన్నారు. రైతులు రైస్ మిల్లర్లను, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అన్నారు. ఏ-గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 ప్రభుత్వం మద్దతు ధరగా ప్రకటించిందని, సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. రైతులు ధాన్యంలో తాలు లేకుండా, 17శాతం లోపు తేమ ఉండేలా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఏవో ఎం.శివరాంకుమార్, ఏఈవో వేణుగోపాల్, ఉన్నారు.



రైతుతో మట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

నాణ్యమైన భోజనం అందించాలి : డీఈవో



అవంతీపురం కేజీబీవీలో స్టోర్‌రూమ్ పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. మంగళవారం మండలంలోని అవంతీపురం కేజీబీవీని ఆయన తనిఖీచేసి పాఠశాల ఆవరణ, వంట గదిని పరిశీలించారు. వర్షాకాలంలో పాఠశాల ఆవరణ, వంటగదిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థినులకు పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పదో తరగతి విద్యార్థినులకు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంఈవో బాలు, పాఠశాల ఎస్‌వో పార్వతి, తదితరులు ఉన్నారు.

తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

డిండి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కృష్ణాజలాల నీటి సరఫరా నిలిచిపోయిన మండలాలకు తాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. డిండి మండలం కందుకూరు వాగును మంగళవారం ఆమె పరిశీలించి తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్లు, స్కీం బోర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. కందుకూరు వాగు నుంచి ఏర్పాటుచేసిన కృష్ణాజలాల పైప్‌లైన్ (మిషన్‌భగీరథ) వాగు నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో 20 రోజులకుపైగా డిండి మండలంతోపాటు చందంపేట, నేరేడుగొమ్ము, దేవరకొండ మండలాల్లోని పలు గ్రామాలకు నీటి సరఫరా నిలిచింది. పైప్‌లైన్ పునరుద్ధరణకు వాగులో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు అవరోధంగా ఉందని, నీరు తగ్గేవరకు సాధ్యంకాదని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు కావాల్సిన నిధులు విడుదల చేస్తామని కలెక్టర్ అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్), ప్రాథమిక వైద్యశాలను తనిఖీచేశారు. ఏటీసీలో ఏర్పాటు చేసిన యంత్రాలను పరిశీలించి చెక్‌లిస్ట్‌తో సరిచూశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో వెంకన్న, తదితరులు ఉన్నారు.



మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

బీసీ రిజర్వేషన్ల అమలును అడ్డుకోవడం సరికాదు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అమలును అడ్డుకోవడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేపట్టిన చర్యలను కొందరు అడ్డుకునే కుట్రలు పన్నుతున్నారన్నారు. చట్టసభల్లో వెనుకబడిన వర్గాలను ఆహ్వానించాల్సిన వారే న్యాయస్థానాలకు ఆశ్రయించడం దురదృష్టకరమన్నారు. వారికి మంచి బుద్ధి కలిగించాలని, బడుగుల జీవితాలను మార్చే బీసీ రిజర్వేషన్ల బిల్లు గవర్నర్ ఆమోదం పొందాలని దేవుళ్లను వేడుకుంటున్నట్లు తెలిపారు. జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు ఎర్రబెల్లి దుర్గయ్య, కుమ్మరికుంట్ల సుధాకర్, దోనేటి శేఖర్. మునుకుంట్ల లక్ష్మీనారాయణ, భాసం శ్రీను, బంటు సైదులు, గంట రాంబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న నాయకులు

భూములు ఇచ్చే ప్రసక్తే లేదు : రైతులు

చింతపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కాల గ్రామంలో సర్వే 173లో 45 ఎకరాల భూమిని ఆర్‌అండ్‌ఆర్ కింద శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయిర్‌కు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు తేల్చిచెప్పారు. మంగళవారం వారు గ్రామంలో ఆందోళన చేశారు. 60 సంవత్సరాల క్రితం నిరుపేద రైతులను గుర్తించి భూములు ఇచ్చారని గుర్తుచేశారు. గతంలో భూమిలో పిచ్చి మొక్కలతో దేనికీ పనిరాకుండా ఉన్న భూమిలో వాటిని తొలగించి గ్రామానికి చెందిన కొంతమంది రైతులు సాగు చేస్తున్నారు. చర్లగూడెంలో నిర్మించే ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భూమిని కోల్పోయిన వారికి 173 సర్వేనంబర్‌లోని 45 ఎకరాల భూమిలో భూనిర్వాసితులకు కేటాయించడం సరికాదన్నారు. ఈ భూమిలో పత్తి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించి తమకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని రైతులు హెచ్చరించారు.



పత్తి పంటను చూపిస్తున్న రైతులు

రామకృష్ణ మృతి కాంగ్రెస్‌కు తీరనిలోటు



రామకృష్ణ అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మాజీ కౌన్సిలర్ గంధం రామకృష్ణ మృతి కాంగ్రెస్ పార్టీకి లోటని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం జరిగిన రామకృష్ణ అంత్యక్రియల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి రామకృష్ణ కృషి చేశారని గుర్తు చేశారు. రామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, నీరుకంటి నారాయణ, గాయం ఉపేందర్‌రెడ్డి, తలకొప్పుల సైదులు, ముదిరెడ్డి నర్సిరెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, జానీ, కృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరులో దంచికొట్టిన వాన

- పొంగుతున్న వాగులు • అలుగు పోస్తున్న చెరువులు • నేలవాలిన పంటలు

నిడమనూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. నాలుగు గంటల పాటు ఏకధాటిగా ఉరుములు, మెరుపులతో కుండపోతగా కురిసింది. సాయంత్రం వరకు విపరీతమైన ఎండతో పాటు ఉక్కపోతగా ఉన్న వాతావరణం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు వర్షం దంచికొట్టింది. భారీ వర్షం కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు అలుగు పోస్తున్నాయి. మండల కేంద్రంలోని నల్లచౌట చెరువు నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరుకుని ఉధృతంగా అలుగు పోస్తోంది. చెరువు దిగువన ఉన్న కాలనీలోకి నీళ్లు చేరడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వివిధ గ్రామాల్లో వరి పొలాలు నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊట్కూరు గ్రామంలో నర్సింగు కృష్ణయ్య అనే రైతు సాగు చేసిన ఐదు ఎకరాల వరి పొలం వర్షానికి నేలకొరగడంతో దిగుబడిపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశాడు. అదే విధంగా వివిధ గ్రామాల్లో వాగులు పొంగి పొర్లుతుండంతో రాకపోకలు నిలిచిపోయాయి. నిడమనూరులో చిలుకల వాగు పొంగి వరద నీరు బంకాపురం కల్వర్టును ముంచెత్తింది. దీంతో నిడమనూరు మీదుగా బంకాపురం, వెనిగండ్ల, సూరేపల్లి తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ఊట్కూరులో వాగు పొంగడంతో కల్వర్టు స్థానంలో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు మళ్లీ తెగిపోయింది, దీంతో నందికొండవారిగూడెం, గౌండ్లగూడెం, సోమారిగూడెం, ముప్పారం గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. కురుస్తున్న వర్షాల కారనంగా తరచుగా డైవర్షన్ రోడ్డు తెగి రాకపోకలకు అంతరాయం కలుగుతుండటంతో వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో వరద కారణంగా డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోతుంది.



అలుగు పోస్తున్న నిడమనూరు చెరువు

పొంచిఉన్న ప్రమాదం..

హాలియా: సోమసముద్రం చెరువుకు సంబంధించిన అలుగుకింది భాగంలో ఉన్న పేరూరు రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. భారీ వర్షాలు కురిన ప్పుడల్లా చెరువు నిండిపోయి అలుగు మీదుగా పక్కనే ఉన్న పేరూరు మెయిన్ రోడ్డుపై పెద్ద ఎత్తున వరద ప్రవహిస్తోంది. ఈ వర్షాకాలం సీజన్‌లో నెల రోజులుగా నాలుగు సార్లు రోడ్డును వరద ముంచెత్తడంతో ప్రయాణానికి తరుచూ ఆటంకం కలుగుతుంది. దీనివల్ల పేరూరు మీదుగా హాలియాకు వెళ్లే 10గ్రామాల ప్రజలు ప్రయాణానికి ఇబ్బందులకు గు రవుతున్నారు. రోడ్డుపై నుంచి వరద నీరు పారుతున్నా అత్య వసర పరిస్థితుల్లో వాహనాలు వెళ్తుండడంతో ప్రమాదం పొంచి ఉంది.

ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలి : మాజీ ఎమ్మెల్యే

చింతపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): డిండి, ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని హరిజపురం గ్రామానికి చెందిన సీపీఐ కార్యకర్త ఎదుళ్ల రాములు స్థూపాన్ని ఆవిష్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయక కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, మండల కార్యవర్గ సభ్యుడు షేక్. శంషోద్దీన్, మల్లోజు శేఖరాచారి, వింజమూరి నరసింహ, యాచారం శ్రీశైలం, ఎదుళ్ల గణేష్, ధర్మయ్య, మధు, బాదం మల్లేష్, జక్కుల లింగం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి

చింతపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నసర్లపల్లి మాజీ సర్పంచి పున్‌రెడ్డి సుమతిరెడ్డి అత్త ప్రమీలమ్మ మృతిచెందడంతో ఆమె మృతదేహానికి పూలమాల వేసి కుటుంబసభ్యులను పరామర్శించారు. మోసపూరితమైన మాటలతో అధికారంలోకి వచ్చి హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. స్థానిక ఎన్నికల బరిలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి, జెల్లా యాదగిరి, బాదేపల్లి పులిరాజ్, పరమేష్, మేకల వెంకటయ్య, సీమర్ల శ్రీనుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.